జాతీయ దినపత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 185 | మంగళవారం | 21-7-2026



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08










## చలో సంసద్..
# రణరంగం

**విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో పార్లమెంట్ ముట్టడికి యత్నించిన విద్యార్థులు, ఆందోళనకారులు**

- హోరువానను సైతం లెక్కచేయకుండా వేలాదిగా పార్లమెంట్ దిశగా కదలిన యువత
- కాక్రోచ్ కార్యకర్తలను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేసిన పోలీసులు
- బాష్పవాయుగోళాల ప్రయోగం.. పలువురికి తీవ్ర గాయాలు
- 118 మంది పోలీసులకూ గాయాలు
- ఆమరణ దీక్షావేదికను పూర్తిగా తొలగించిన పోలీసులు

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో సంసద్ ర్యాలీ'రణరంగాన్ని తలపించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల సాక్షిగా ఎంపీలను నిలదీసి విద్యార్థుల సమస్యలకు పరిష్కారం తేల్చుకుంటామంటూ వేలాది మంది కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు, పరీక్షార్థుల తల్లిదండ్రులు సోమవారం పార్లమెంట్ దిశగా మొదలెట్టిన ర్యాలీ చివరకు ఉద్రిక్తంగా ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి నాటికే జంతర్‌మంతర్‌లోని దీక్షా స్థలికి వేలాదిగా మద్దతుదారులు, విద్యార్థులు చేరుకుని సోమవారం ఉదయం పార్లమెంట్ దిశగా ర్యాలీ మొదలుపెట్టగా పోలీసులు మొదట్లోనే అడ్డుకున్నారు. పార్లమెంట్, సెంట్రల్ విస్టా, కన్నాట్ ప్లేస్, సమీప

- మిగతా 2వ పేజీలో

## తొలి రోజే దుమారం

- నీట్, అయోధ్యలో విరాళాల చోరీ, విద్యార్థుల నిరసనలపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలు
- పలుమార్లు వాయిదాపడిన ఉభయ సభలు

2లో



## నడ్డాతో సీజేపీ నాయకుల భేటీ..

కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సీజేపీ నాయకుల సమావేశం ముగిసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం శ్రద్ధగా విన్నదని, వాటిని పరిశీలిస్తుందనే నమ్మకం ఉందని సీజేపీ నేతలు వెల్లడించారు. సమావేశం ప్రశాంత వాతావరణంలో జరిగిందని, తమ ఆందోళనలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





## సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవం

- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

రాష్ట్రంలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన, సులభతరమైన సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' (శాఖ) ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం.

- మిగతా 2వ పేజీలో



2లో

## భారీ వర్షాలతో జమ్మూకశ్మీర్ అతలాకుతలం

- పూంఛ్‌లో మట్టిదిబ్బ కూలి ఏడుగురి మృతి తల్లి, ఇద్దరు బిడ్డల సజీవ సమాధి
- డోడాలో బస్సుపై బండరాయి.. ఇద్దరి మృతి మరో ఘటనలో మహిళ మరణం
- భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు తీర్థయాత్రల తాత్కాలిక రద్దు

## కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి

- మంగళగిరిలో తల్లికి వందనం లబ్ధిదారులతో మంత్రి లోకేశ్ భేటీ
- పథకం అమలు, ఆర్థిక సాయం వినియోగంపై ఆరా
- విద్యార్థుల తల్లుల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- కొండపనేని టౌన్‌షిప్ పార్కులో ముఖాముఖి కార్యక్రమం

2లో



## వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులకు ఇళ్లు



- 'క్యూర్'లో ఎల్ఐజీ ఇళ్లకు నేటి నుంచే దరఖాస్తులు: మంత్రి పొంగులేటి
- తొలుత 16 నియోజకవర్గాల్లో 500 చొప్పున ఇళ్ల నిర్మాణం
- రూ.5 లక్షల సబ్సిడీ, మిగిలిన రూ.6 లక్షలు 4 వాయిదాల్లో చెల్లించాలి
- వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులకు ఇళ్లు
- మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజహరుద్దీన్‌లతో కలిసి పథకం ప్రారంభం

హైదరాబాద్: హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని 16 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ఈ బోనాల పండగకు ప్రారంభిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. తొలివిడతలో మొత్తం 7,680 ఇళ్లు నిర్మిస్తామని, వచ్చే బోనాల పండగ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. జూలై 21 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. అపార్ట్‌మెంట్ల

- మిగతా 2వ పేజీలో



## రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో..
## ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో..

- కాళేశ్వరం నీళ్లు సముద్రం పాలవుతున్నా సీఎం రేవంత్ స్పందించడం లేదు
- 6 గ్యారంటీలు అభాసుపాలు.. రెండున్నరేళ్ల పాలనలో సాగు సంక్షోభం
- 70వేల ఉద్యోగాలపై సవాలును స్వీకరించే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా?

2లో



## ఏడాదిగా ఆమెతో రిలేషన్ షిప్...

- మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం
- హైదరాబాదులోని జాతీయ పోలీసు అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళా ట్రైనీ ఐపీఎస్
- శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి

2లో

## భారీ వర్షాలతో జమ్మూకశ్మీర్ అతలాకుతలం

గువాహటి/జమ్మూ/డెహ్రాడూన్: జమ్మూ కశ్మీర్ అతాలాకుతలమవుతోంది. సోమవారం కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలను ఆకస్మిక వరదలు చుట్టుముట్టాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. వేర్వేరు ఘటనల్లో 11 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. హిమాలయ ప్రాంత రాష్ట్రాలు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలోనూ సోమవా రం భారీ వర్షాలు జన జీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. మంగళవారం కూడా ఈ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదు కావచ్చునని భారత వాతావరణ శాఖ మంగళవారం ప్రకటించింది. ఉత్తరాఖండ్, బిహార్, అసోం, మేఘాలయాల్లో సోమవారం భారీ వర్షాలు నమోదైనట్లు తెలిపింది. రానున్న నాలుగైదు రోజుల్లో వాయువ్య, ఈశాన్య రాష్ట్రాల్లో రుతుపవనాలు చురుకుగా ఉంటాయని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం బలపడిన కారణంగా రుతుపవనాలు చురుకుగా మారాయని తెలిపింది. ఉత్తరాఖండ్‌లో ఒక బాలిక సరయూ నదిలో కొట్టుకుపోయి గల్లంతయ్యింది. దీంతో ఉత్తరాఖండ్‌సహా, జమ్మూ కశ్మీర్‌లో పలు తీర్థయాత్రలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఫలితంగా వందలాది మంది యాత్రీకులు శిబిరాల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. భారీ వర్షాల కారణంగా జమ్మూ కశ్మీర్‌లోని పూంఛ్ ప్రాంతంలో కొండచరియ విరిగిపడ్డ ప్రమాదంలో ఏడుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఎత్తైన ప్రాంతంలో ఉన్న లోరాన్ గ్రామంలో ఈ ప్రమాదం జరిగిందని భారీ మట్టిదిబ్బ ఒకటి అకస్మాత్తుగా ఇంటిపై పడిందని తెలిపారు. మరణించిన ఏడుగురిలో తల్లి, ఇద్దరు బిడ్డలు కూడా ఉన్నారని చెప్పారు. రాజౌరీ ప్రాంతంలో ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయిన వికాస్ అహ్మద్ అనే వ్యక్తి మృతదేహాన్ని అధికారులు వెలికితీశారు. పూంఛ్ ప్రాంతంలో గత శనివారం నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయి.

## ఏడాదిగా ఆమెతో రిలేషన్ షిప్...



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపుల ఆరోపణల వ్యవహారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం, ఆ తర్వాత ఆయన రాశారని చెబుతున్న ఒక లేఖ వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తమ మధ్య ఉన్నది ఏకపక్ష వేధింపులు కావని, అది పరస్పర అంగీకారంతో కూడిన సంబంధమని... తామిద్దరం ఏడాదిగా రిలేషన్ షిప్ లో ఉన్నామని ఆయన ఆ నోట్‌లో పేర్కొనడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ (ఎస్వీపీఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఉదయం ఎర్రగడ్డ మోతీ నగర్‌లోని బంధువుల నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. కుటుంబసభ్యులు వెంటనే ఆయన్ను ఎస్ఆర్ నగర్‌లోని జయంతి ఆసుపత్రికి తరలించారు. ఆయన శానిటైజర్ సేవించి ఆత్మహత్యకు యత్నించారని వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. అంతకుముందు, ఉదయ్ కృష్ణారెడ్డిపై కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల వివాహిత, సహ ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి జూలై 10 మధ్య కాలంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించారని, అసభ్యకర వాట్సాప్ సందేశాలు పంపారని ఆరోపించారు. జూలై 9న తనపై భౌతికంగా దాడి చేసి, జుట్టు పట్టుకుని లాగి, గొంతు నులిమి, కత్తితో బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రైవేట్ వీడియోను తన భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కూడా ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, దాడి, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలపై జాతీయ పోలీస్ అకాడమీ అంతర్గత విచారణ జరిపి, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం ఉదయ్‌ను అకాడమీ నుంచి తాత్కాలికంగా పంపించివేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఉదయ్ కృష్ణారెడ్డి రాశారని చెబుతున్న లేఖ వెలుగులోకి వచ్చింది. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, తమ మధ్య ఏడాదిగా రిలేషన్ షిప్ ఉందని ఆయన ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా సంబంధం కొనసాగిందని, ఆమె తన గదికి వచ్చిన వీడియో ఆధారాలు తన మొబైల్ ఫోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ విషయం గురించి తాను ఆమె భర్తకు కూడా తెలియజేశానని వెల్లడించారు. ఆమే తన గదికి వచ్చి తలుపు తెరవాలని బెదిరించిందని ఉదయ్ కృష్ణారెడ్డి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి, చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి నాయనమ్మ సంరక్షణలో పెరిగారు. 2013లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, ఐదో ప్రయత్నంలో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణం అందరి ప్రశంసలు పొందింది. మహిళా అధికారిణి ఫిర్యాదు, ఉదయ్ కృష్ణారెడ్డి లేఖలోని అంశాలపై పోలీసులు రెండు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## నడ్డాతో సీజేపీ నాయకుల భేటీ..

సీజేపీ ప్రతినిధి బృందం జేపీ నడ్డాను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. అనంతరం వారు మాట్లాడుతూ.. చర్చలు సానుకూలంగా జరిగాయని, ప్రభుత్వం తమ సమస్యలపై త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. సమావేశం తర్వాత తమ మద్దతుదారులకు శాంతిని పాటించాలని సీజేపీ నేతలు కీలక విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రస్తుతం జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనకారులను బలవంతంగా తొలగించే ఆలోచన లేదని వర్గాల సమాచారం. ఈ సందర్భంగా వాళ్ల డిమాండ్స్ గురించి మాట్లాడుతూ.. సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని లేదా కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రాణాలు కోల్పోయిన 20 మందికి పైగా నీట్ అభ్యర్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. మరోవైపు జేపీ నడ్డా కూడా ఈ సమావేశంపై స్పందించారు. ఆదివారం ఉదయం నిరసనకారుల ప్రతినిధులతో చర్చలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉదయం 11:50 గంటలకు మొదలైన చర్చల్లో మొదట మౌఖికంగా సమస్యలను విన్నామని, అనంతరం సాయంత్రం లిఖితపూర్వక వినతిపత్రంపై చర్చించామని పేర్కొన్నారు. చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని తెలిపారు. నిరసనకారులు ఆందోళన విరమించి సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు సహకరించాలని జేపీ నడ్డా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంపై కేంద్ర ప్రభుత్వం త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం అందరి దృష్టి ప్రభుత్వ తదుపరి నిర్ణయంపైనే ఉంది.

# చలో సంసద్.. రణరంగం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో 163వ సెక్షన్‌ను విధించారు. ర్యాలీకి అనుమతిలేనందున ఐదుగురికి మించి గుమికూడవద్దని హెచ్చరించారు. వదంతులు వ్యాపించకుండా ఉండేందుకు సెంట్రల్ ఢిల్లీ పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను కొన్ని గంటలపాటు పోలీసులు నిలిపేశారు. ఉద్యమకారులున్న చోట్ల జామర్‌లను ఏర్పాటుచేశారు. అయినాసరే పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ మరింత మంది విద్యార్థులు, కార్యకర్తలు, మద్దతుదారులు బస్సులు, ఆటోలు, బైక్‌లలో వేర్వేరు దారుల్లో పార్లమెంట్ సమీపానికి చేరుకున్నారు. స్కూల్ యూనిఫామ్‌లో పాఠశాల విద్యార్థులు మొదలు కాలేజీ స్టూడెంట్స్, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, వృద్ధులు, యోగేంద్ర యాదవ్ వంటి సామాజికవేత్తలు పెద్దసంఖ్యలో పార్లమెంట్ సమీప రోడ్లమీదకొచ్చారు. జాతీయజెండాలు చేతపట్టుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలుచేశారు. భారత్ మాతాకీ జై, జై భీం, వందేమాతరం, ధర్మేంద్ర ప్రధాన్ దిగిపో నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. వీళ్లు ముందుకెళ్లకుండా పోలీసులు బారికేడ్లను అడ్డుగా ఉంచారు. వాటినీ ఆందోళనకారులు తొలగించారు. దీంతో వీళ్లను అదుపుచేయడం కోసం పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేశారు. దీంతో పలువురు తీవ్రస్థాయిలో గాయపడ్డారు. పార్లమెంట్ స్ట్రీట్, పటేల్ చౌక్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, శాస్త్రీ భవన్, రైల్ భవన్ సమీప ప్రాంతాల్లో జనాన్ని చెదరగొట్టేందుకు బాష్పవాయుగోళాలు సైతం ప్రయోగించారు. పోలీసులు ఇష్టమొచ్చినట్లు చితకబాదుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తోటి కార్యకర్తలను కొడుతున్నాసరే ఇంకొందరు అలాగే రోడ్డు మీద బైఠాయించి 'కొట్టండి సార్ కొట్టండి'అని తమ తీవ్రస్థాయి నిరసన తెలపడం ఒక వీడియోలో కన్పించింది. "పోలీసులు కొందరి తల పగలగొట్టారు. కిందపడ్డ విద్యార్థులనూ వదల్లేదు"అని 55 ఏళ్ల హెలెన్ అనే మహిళ తెలిపారు. గాయపడిన వారిని తోటి విద్యార్థులు హుటాహుటిన సమీప ఆస్పత్రుల్లో చేర్పించారు. అయితే విద్యార్థుల నుంచి సైతం పోలీసులు తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదుర్కొన్నట్లు పోలీసువర్గాలు తెలిపాయి. ఈ తోపులాటలో 118 మంది పోలీసులు గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. తమపై జనం రాళ్లు రువ్వడంతోనే లాఠీచార్జ్ చేయాల్సివచ్చిందని పోలీసులు తమ చర్యను సమరి?థంచుకున్నారు. ఈ ఘటనలో 100కుపైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ తర్వాత అందర్నీ విడిచిపెట్టే ఆస్కారముందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే సమీప రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రిలో 65 మెడికో లీగల్ కేసులు నమోదయ్యాయి. ర్యాలీలో లద్దాఖ్ సామాజికవేత్త, నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలిని పోలీసులు జుట్టు పట్టుకుని లాగి కొట్టారని వచ్చిన వార్త అవాస్తవమని ఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ స్పష్టం చేశారు.

న్యూఢిల్లీ: దాదాపు మూడు వారాలుగా దీక్షపర్వంలో మునిగిపోయిన సీజేపీ కార్యకర్తలకు తొలిసారిగా ప్రభుత్వం నుంచి పిలుపొచ్చింది. దీంతో సీజేపీ అధికార ప్రతినిధులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లు సోమవారం సాయంత్రం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ ప్రధాన డిమాండ్లను మంత్రికి వెల్లడించారు. "ఎలాంటి షరతుల్లేకుండా ఆస్పత్రి నుంచి సోనమ్ వాంగ్‌చుక్‌ను విడుదలచేయాలి. ఆయన ఒక వీడియో సందేశం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. అందుకు అనుమతించాలి. ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ పదవి నుంచి తప్పించాలి లేదా ఆయనతో రాజీనామా చేయించాలి. నీట్--యూజీ,2026 ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో తీవ్ర నిరాశతో బలవన్మరణాలకు పాల్పడిన పరీక్షార్థులకు తలో రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం తక్షణం ప్రకటించాలి. దీక్షాస్థలిని నాశనంచేసిన పోలీసులు ఇకపై కార్యకర్తల జోలికి వెళ్లకూడదు. శాంతియుత నిరసనను పోలీసులు ఉక్కుపాదంతో అణచివేసేందుకు యత్నించకూడదు"అని నడ్డాకు అందజేసిన లేఖలో సీజేపీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులకు ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

తరహాలో నిర్మించే ఈ ఇళ్లకు స్థలాలు ఎంపికైన నియోజకవర్గాల్లో ఇప్పుడు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, క్యూర్ పరిధిలోకి వచ్చే మిగతా నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక కాగానే అక్కడ కూడా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తామని తెలిపారు. అత్యాధునిక హంగులతో కూడిన హౌసింగ్ టవర్లను నిర్మించి అందులోని ఫ్లాట్లను లబ్ధిదారులకు అందించనున్నారు. సోమవారం సచివాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్‌తో కలిసి క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల పథకం బ్రోచర్‌ను, ఇళ్ల నమూనాలను, మీ--సేవ, వాట్సాప్‌లో దరఖాస్తు విధానాన్ని ఆవిష్కరించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ.. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. క్యూర్ పరిధిలోని ఎల్ఐజీ ఇళ్లు 525 చ.అ. వైశాల్యంతో ఉంటాయని, మౌలిక వసతుల ఖర్చు సహా ఒక్కో ఇంటికి సగటున రూ.11 లక్షల వరకు ఖర్చవుతుందని పొంగులేటి తెలిపారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీగా రూ.5 లక్షలు అందించనుండగా, మిగతా రూ.6 లక్షలను నాలుగు వాయిదాల్లో లబ్ధిదారు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇల్లు మంజూరు కాని వారికి ఆ రూ.10 వేలు తిరిగి చెల్లిస్తామన్నారు. నగరంలో భూముల ధరలు రూ. వందల కోట్లలో ఉన్నప్పటికీ, లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఉచితంగా భూమిని అందజేస్తోందని, ఆ అపార్ట్‌మెంట్ స్థలంలో అన్‌డివైడెడ్ షేర్, ఇంటి పట్టా ఆ కుటుంబ మహిళ పేరిటే ఉంటుందన్నారు. ఈ ఇళ్లను పదేళ్ల వరకు విక్రయించే హక్కు ఉండదని, బ్యాంకు రుణం కోసం తాకట్టు పెట్టుకునే వెసులుబాటు మాత్రం ఉంటుందన్నారు. ఈ నెల 21 నుంచి మీసేవ, వాట్సాప్ (నంబర్: 8096958096), వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పొంగులేటి తెలిపారు. ఈ ఇళ్లలో ఒక హాలు, పడగ గది, వంటగది, టాయిలెట్ ఉంటాయన్నారు. త్వరలోనే మధ్యతరగతి వర్గాల ఇళ్ల పథకంపై ప్రకటన ఉంటుందని తెలిపారు.

## రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో..ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో..

రాష్ట్రంలో ఎల్‌నినో మూలంగా కరువు పరిస్థితులు ఎదురవుతాయని ఆరు నెలల ముందే శాస్త్రవేత్తలు హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఓ వైపు రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరుకుంటే ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో పడుకుందని ఎద్దేవా చేశారు. వ్యవసాయంపై అవగాహన లేని ప్రభుత్వానికి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళిక, దిశ లేదని మండిపడ్డారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరిల్ శ్రీనివాస్ తెలంగాణ భవన్‌లో సోమవారం కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. 'సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ఒక చిచోరా. ఎప్పుడు ఎక్కడ ఏం మాట్లాడతారో తెలియని వ్యక్తి సీఎంగా ఉన్నాడు. తెలంగాణలో దోచుకున్న డబ్బును మూటలు కట్టి నెలకోమారు రాహుల్ గాంధీకి అప్పగించి తన పదవిని రెన్యూవల్ చేసుకోవడమే రేవంత్‌కు తెలుసు. తెల్లారితే కేసీఆర్‌ను దూషించడం, దేవుళ్లపై ఒట్లు వేయడం మినహా రేవంత్ ప్రభుత్వానికి మరో పని లేదు. రెండున్నరేళ్లలో వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో పడిపోయింది.

## సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవం

(మొదటి పేజీ తరువాయి)

ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు" అని తేల్చిచెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే ఈ కేంద్రాలు పనిచేస్తాయని, వాటి పనివిధానాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వల్ల ఆ ప్రక్రియ ఎంత సులువుగా మారిందో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అదే విధంగా మారుతుందని ఆయన వివరించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. "వాస్తవాలను ప్రజలకు వివరించి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి ఉపాధికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాం" అని భరోసా ఇచ్చారు. సమీక్షలో భాగంగా పలు ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. 'దీపం-2.0' పథకం లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులను క్రమబద్ధంగా చేపట్టాలని, వీలైతే నిర్దిష్ట తేదీల్లో చెల్లింపులు చేసేలా చూడాలని సూచించారు. పౌరసరఫరాల, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, సాంకేతిక అంశాలను పరిశీలించి దీనిని అమలు చేయాలన్నారు. అదేవిధంగా, కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రయోజనం లేని ఫిర్యాదులు చేసే 'లిటిగెంట్ పిటిషనర్ల'ను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 81 మందిని గుర్తించాం. ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.

## కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం అమలు తీరును తెలుసుకునేందుకు విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ లబ్ధిదారులతో నేరుగా సమావేశమయ్యారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని బైపాస్ రోడ్డులో ఉన్న కొండపనేని టౌన్‌షిప్ పార్కులో విద్యార్థుల తల్లులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం పిల్లల చదువులకు ఏ విధంగా ఉపయోగపడుతోందో మంత్రి లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు లబ్ధిదారులతో ఆయన స్వయంగా మాట్లాడారు. అదే సమయంలో, ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలను మంత్రి లోకేశ్ స్వీకరించారు. లబ్ధిదారులు చెప్పిన విషయాలను ఆయన ఓపికగా వింటూ, వాటిని పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# తొలి రోజే దుమారం

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజు సమావేశాలు విపక్షాల నినాదాల హోరులో కొట్టుకుపోయాయి. ఎలాంటి చర్చలు జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభలు సోమవారం అర్ధ?ధంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడ్డాయి. ప్రతిష్టాత్మక నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, అయోధ్య రామ మందిరంలో కోట్ల రూపాయల విరాళాల చోరీ, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ తదితర కీలకాంశాలపై చర్చ చేపట్టాలంటూ విపక్ష పార్టీల నేతలు పట్టుబట్టడంతో పార్లమెంట్ ఉభయసభల్లో తొలిరోజే ప్రతిష్టంభన నెలకొంది. 'ఇండియా'కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ సమయం వృథాగా ఖర్చయిపో యాయి. సభాకార్యకలాపాలకు విపక్ష సభ్యులు అడ్డుతగలడంతో లోక్‌సభ, రాజ్యసభలు తలో ఆరుసార్లు వాయిదాపడ్డాయి. ఉభయ సభాపతులు ఇరుసభలను మంగళవారానికి వాయిదావేశారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే మరణించిన మాజీ ఎంపీలకు నివాళులు అర్పించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వివిధ అంశాలపై చర్చ కోరుతూ వెంటనే నినాదాలు చేశారు. సభ నినాదాలతో నడవదని, సభ్యులు తమ స్థానాల్లో కూర్చొని సభా కార్యక్రమాలకు సహకరించాలని స్పీకర్ బిర్లా విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీసహా పలు ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోంచి లేచి ముందుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నినాదాలతో లోక్‌సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభ్యులను శాంతించాలని మరోమారు కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు కొనసాగడంతో మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభం అయ్యాక విపక్షాల ఆందోళన కొనసాగడంతో వాయిదాల పర్వం కొనసాగి, చివరికి సభ మంగళవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో పత్రాల సమర్పణ, నూతన సభ్యుల ప్రమాణస్వీకారం, మృతిచెందిన సభ్యులకు సంబంధించిన సంతాప తీర్మానాల అనంతరం సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వెంటనే రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని ప్రస్తావించారు. "జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థుల గొంతు ప్రభుత్వం నొక్కేస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సమస్యపై చర్చ జరగాల్సిందే. జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ప్రభుత్వం బలప్రయోగం, లాఠీఛార్జి చేస్తోంది. వారి గొంతును అణచివేస్తోంది"అని ఖర్గే అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై అధికార కూటమి ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా పరిస్థితి అలాగే కొనసాగింది. జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అయోధ్యలోని రామమందిరంలో కోట్ల రూపాయల విరాళాలను చోరీచేసిన ఉదంతంపై చర్చ జరపాలని పట్టుబట్టారు.



## చేనేత కార్మికులకు అండగా ఉంటాం: పుట్ట వీరయ్య

- బొందుగుల చేనేత సంఘ పాలకవర్గం ప్రమాణస్వీకారం

**తొలివెలుగు, రాజపేట :** మండలంలోని బొందుగుల గ్రామంలో శ్రీ వేంకటేశ్వర సిల్క్ చేనేత పరస్పర సహాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకవర్గం ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించింది. సంఘం అధ్యక్షుడిగా పుట్ట వీరయ్య, ఉపాధ్యక్షుడిగా మదూరి జ్ఞానవర్ధన్, కార్యదర్శిగా కుందేన దత్తాద్రిలతో పాటు డైరెక్టర్లుగా పుట్ట బాల నరసింహ్మా, గోలి ఆంజనేయులు, పుట్ట ఈశ్వరయ్య, బొమ్మ జనార్ధన్, బొమ్మ సిద్ది లింగం, చెన్నూరి లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధ్యక్షుడు పుట్ట వీరయ్య మాట్లాడుతూ.. సంఘ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు ప్రతీ చేనేత కార్మికుడికి అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలేరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చింతకింది మురళి, సంఘం మాజీ అధ్యక్షులు పుట్ట బాలరాజు, పుట్ట మల్లేశం, సంఘ సభ్యులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్‌కే ఫౌండేషన్ ద్వారా పేదలకు బట్టల పంపిణీ

- పేద మహిళలకు చీరలు.. వృద్ధ దంపతులకు వస్త్రాల అందజేత





**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేటలో ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పేద మహిళలు, వృద్ధ దంపతులకు బట్టలు పంపిణీ చేశారు. గుర్రం లింగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలకు చీరలు, వృద్ధ దంపతులకు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గుర్రం లక్ష్మి నర్సమ్మ, పంతులమ్మ, కోకట్ల యాదమ్మ, కూతురు ఎల్లవ్వ, ఎర్రగోకుల లక్ష్మి, శ్రీరాముల మహేశ్వరి, కొత్త కృష్ణవేణి, వజ్జల పుష్ప, సిద్ధమ్మ-గాలయ్య దంపతులు, గౌడ నాగయ్య దంపతులు, కటికే రాజమల్లయ్య తదితరులకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుర్రం సదానందం, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, పాండు, నర్సింహులు, బాబు, నరహరి, లక్ష్మీనారాయణ, లైక్ లక్ష్మీనారాయణ, చక్రవర్తి, నర్సింగం, లక్ష్మి నర్సమ్మ, పంతులమ్మ భాగ్య, ఎస్.ఆర్. మల్లేష్, కే. లింగం, సీహెచ్. కిష్టయ్య, మేరే బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆర్‌కే ఫౌండేషన్ ప్రతినిధులను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.


## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

- బేగంపేట సర్పంచ్ ఇండ్ల అనుష సుమన్ ఉదారత
- బాధిత కుటుంబానికి పరామర్శ.. అండగా నిలిచిన సర్పంచ్

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన నాగారం కిష్టయ్య ఇటీవల మృతి చెందగా, సోమవారం గ్రామ సర్పంచ్ ఇండ్ల అనుష సుమన్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. కిష్టయ్య మృతితో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా తన సొంత ఖర్చులతో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగారం రామచంద్రం, తోట సత్తయ్య, మాజీ ఎంపీటీసీ భోగ హరినాథ్, చిగుర్ల గణేష్, ప్యాట నరేష్, చింతిగారి రమేష్, నాగారం బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ పరిశీలన





- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించాలి
- భాజపా మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట :** కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను భాజపా నాయకులు పరిశీలించారు. మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సర్నేనిగూడెం, వెల్లంకి, సిరిపురం, బోగారం గ్రామాల పరిధిలోని 12 పోలింగ్ బూత్‌లలో ఈ నెల 8 నుంచి 19వ తేదీ వరకు కొనసాగిన ప్రత్యేక సవరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మధుకర్ రెడ్డి మాట్లాడుతూ.. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. నిజమైన భారత పౌరులందరికీ న్యాయబద్ధంగా ఓటు హక్కు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లను తొలగించేలా బీఎల్‌ఏలు, స్థానికులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, సిరిపురం ఉప సర్పంచ్ మూడుదుడ్ల రమేష్, నాయకులు నకిరేకంటి మహేష్, చిక్క బాబురావు, వీరమల్ల సత్యనారాయణ, మద్దెలపూరి ఐలయ్య, బీఎల్ఏ-2లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్య హక్కులకు ముప్పు







- 2029 ఎన్నికల లబ్ధికే భాజపా ప్రయత్నాలు: సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు
- చౌటుప్పల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ప్రాంతీయ సదస్సు

**తొలివెలుగు, చౌటుప్పల్ టౌన్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు ఆందోళన వ్యక్తంచేశారు. చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీపీఎం మున్సిపల్, మండల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు.

**2029 ఎన్నికలే లక్ష్యంగా ఎత్తుగడలు**

అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమైతే తాము పూర్తిగా మద్దతిస్తామని రాఘవులు తెలిపారు. అయితే, ప్రస్తుతం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ వెనుక 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ లాభం పొందాలనే ఉద్దేశం ఉందన్నారు. భాజపాకు పడని మైనారిటీలు, దళితులు, గిరిజనులు, వలస కార్మికులు, పేద వర్గాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. గతంలో బెంగాల్‌లోనే కోటి ఓట్లు తొలగిస్తే, న్యాయస్థానాలను ఆశ్రయించడం ద్వారా 70 లక్షల ఓట్లను పునరుద్ధరించుకోగలిగామని గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రమాదం ఉందన్నారు.

**సర్వపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి: ఎండీ జహంగీర్**

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. జిల్లాలో బీఎల్ఓ, బీఎల్ఏలుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి సరైన శిక్షణ లేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎండీ పాషా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీపీఎం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, కొండమడుగు నరసింహ, మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, బూరుగు కృష్ణారెడ్డి, జల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసచారి, గంగాదేవి సైదులు, రాయగిరి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇంద్రపాల ముత్యాలమ్మ ఆలయంలో భక్తులకు వసతుల విస్తరణ

- దాతల సహకారంతో స్నానపు గదుల నిర్మాణానికి శ్రీకారం
- పనులను ప్రారంభించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**తొలివెలుగు, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాల నగరంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ తెలిపారు. సర్పంచ్ విజ్ఞప్తికి స్పందించి భువనగిరి కవిత-శ్రీనివాస్ (తండ్రి: బుగ్గయ్య) దంపతులు అందించిన ఆర్థిక సహకారంతో ఆలయ ఆవరణలో స్నానపు గదుల నిర్మాణ పనులను సోమవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం దాతల భాగస్వామ్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఉదారంగా ఆర్థిక సాయం అందించిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి, పంచాయతీ కార్యదర్శి నరేందర్, పాల సంఘం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, చేనేత సహకార సంఘం చైర్మన్ రవ్వ నర్సింహా, నాయకులు సింగణబోయిన గణేష్, రాస వెంకటేష్, రాజన్నగారి రమేష్, ఈర్లపల్లి మల్లయ్య, గోళ్లేపల్లి యాదయ్య, వడ్లకొండ బిక్షపతి, అమినొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధ తాళలేక.. డయాలసిస్ బాధితుడు బలవన్మరణం

- పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ నిమ్స్‌లో మృతి
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రామన్నపేట పోలీసులు



**తొలివెలుగు, రామన్నపేట :** దీర్ఘకాలిక మూత్రపిండాల (కిడ్నీ) వ్యాధితో బాధపడుతూ తీవ్ర మనోవేదనకు గురైన ఓ వృద్ధుడు పురుగుల మందు సేవించి, చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన రామన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చుప్పల గ్రామానికి చెందిన కొసాని రాములు (60) గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ నిరంతరం డయాలసిస్ చేయించుకుంటున్నారు. అనారోగ్యం తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఈ నెల 15న ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు మృతి చెందారు. మృతుడి కుమారుడు కొసాని లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రామన్నపేట ఎస్ఐ సతీష్ గోపాతి తెలిపారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..



# కామ్రేడ్ నాగన్న సంతాప సభను జయప్రదం చేయాలి

- పీడిత ప్రజల కోసమే జీవితం ధారాదత్తం
- పోచంపల్లిలో సంతాప సభ కరపత్రాల ఆవిష్కరణ



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** హైదరాబాద్‌లో జులై 25న నిర్వహించనున్న కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాప సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి పగడాల శివ పిలుపునిచ్చారు. పోచంపల్లి పురపాలక కేంద్రంలో సోమవారం సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పగడాల శివ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తన కళారూపాల ద్వారా పీడిత ప్రజల విముక్తి కోసం నాగన్న నిరంతరం పోరాడారని కొనియాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేసి ప్రజలను చైతన్యపరిచారన్నారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సంతాప సభకు కళాకారులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు పోతగల నరసింహ, గోరుగంటి ముత్యాలు, కొత్త బాబు, రచ్చ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# గులాబీ శ్రేణుల్లో సంబరం.. ఘనంగా బిక్షమయ్య గౌడ్ బర్త్‌డే

- రాజాపేట గాంధీ చౌక్‌లో ఘనంగా నిర్వహణ
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు

**తొలివెలుగు, రాజాపేట:** ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్ జన్మదిన వేడుకలను సోమవారం రాజాపేట మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో స్థానిక జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహ కూడలి వద్ద ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం బాణాసంచా కాల్చి, గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు ఎర్రగోగుల జశ్వంత్, మాజీ ఫోరం సర్పంచుల వైస్ ప్రెసిడెంట్ గుంటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు, మర్ల నాగరాజు, సోషల్ మీడియా అధ్యక్షుడు గంధమల్ల సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు బెడిదే వీరేశం, సీనియర్ నాయకులు హరినాథ్, బొంగోని ఉప్పలయ్య గౌడ్, మాజీ సర్పంచులు గోపిరెడ్డి, కనకయ్య, ఠాగూర్ ధర్మేందర్ సింగ్, నర్సిరెడ్డి, ఉప సర్పంచులు రెడ్యబోయిన కవిత రాజు, అభీదు, ఉత్తమ రైతు మేక వెంకటేశ్వర్ రెడ్డి, రామూర్తి నాయక్, లక్ష్మణ్ నాయక్, గన్యా నాయక్, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు మొలుగు సోమలింగం గుప్తా, వరుణ్ రమేష్, సకినాల ఉపేందర్, అంబా బాయ్, ఎర్రగోగుల చంద్రయ్య, అశోక్, కోయ బాలరాజు, సగ్గు ఆంజనేయులు, పెద్ద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి


- ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య




**తొలివెలుగు, రామన్నపేట :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులు దాటినా దళిత కాలనీల్లోని పేదల సమస్యలు నేటికీ పరిష్కారం కాకపోవడం విచారకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య అన్నారు. సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో మేడి ముకుంద అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో దళితు ు, వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేదల జీవన పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూమి, ఏడాది పొడవునా ఉపాధి ప్రాప్తికై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి అర్హ కుటుంబానికి 200 రోజుల పని కల్పించి, రోజువారీ కూలీ రేటును పెంచాలని డిమాండ్ చేశారు. దళిత కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి తాగునీరు, డ్రైనేజీ, సీసీ రహదారులు, విద్యుత్ వసతులు కల్పించాలని కోరారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే గ్రామాల వారీగా ఉద్యమాలు చేపట్టి, మండల, జిల్లా స్థాయిల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం మండల కమిటీ సభ్యులు ఆవనగంటి నాగేష్, ఉంద్రాతి నరసింహ, నాగటి లక్ష్మణ్, ఎస్.ఆర్. వెంకటేశ్వర్లు, ఏ. రవీందర్, వి. నరసింహ, డి. నరసింహ, చెన్ని స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

- ఇంజ నర్సయ్య ఫౌండేషన్ ఉదారత
- కాకల్ల యాదగిరి కుటుంబానికి పరామర్శ



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన కాకల్ల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మరణించగా, సోమవారం ఆయన కుటుంబ సభ్యులను ఇంజ నర్సయ్య ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్ పరామర్శించారు. యాదగిరి మృతితో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వారికి తక్షణ ఆర్థిక సాయంగా రూ.5,000 నగదును అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుర్మ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# కల్వర్టుపై రక్షణ గోడలు నిర్మించాలి

- ధర్మారెడ్డిపల్లి కాలువ వద్ద గుంతలతో ప్రమాదాలు
- జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి: సీపీఎం

**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ – చౌటుప్పల్ ప్రధాన రహదారి కింది నుంచి వెళ్లే జాలు కాలువ పరిధిలో ప్రమాదకరంగా మారిన ధర్మారెడ్డిపల్లి కాలువ కల్వర్టుపై తక్షణమే రక్షణ గోడలు (సైడ్ వాల్స్) నిర్మించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం గోకారం నుంచి వెల్లంకి వెళ్లే మార్గంలోని కల్వర్టును సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువ మరమ్మతు పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ కల్వర్టుకు ఇరువైపులా గోడలు నిర్మించకపోవడంతో పోసిన మట్టి కొట్టుకుపోయి పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. మూలమలుపు కావడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణికులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే నాసిరకం పనులు జరుగుతున్నాయని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా వెంటనే సైడ్ గోడలు నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోకారం మాజీ సర్పంచ్ సిర్పంగి శ్రీరాములు, నాయకులు కవిడే సురేష్, మద్దెల మారయ్య, రాపోతు వెంకులు, ఇంద్రా రెడ్డి, చేగూరి నగేష్, గంగాపురం వెంకటేశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'పుష్ప' రేంజ్‌లో టేకు స్మగ్లింగ్.. సీక్రెట్ కేబిన్ల గుట్టు రట్టు!

- కలమడుగు చెక్‌పోస్ట్ వద్ద అటవీశాఖ మెరుపు తనిఖీలు
- వ్యానులో రహస్య కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసి టేకు తరలింపు యత్నం
- వాహనం, టేకు కలప స్వాధీనం.. ముఠాపై లోతైన దర్యాప్తు

**తొలివెలుగు, జన్నారం:** మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు అటవీ చెక్‌పోస్ట్ వద్ద సోమవారం అటవీశాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమ టేకు స్మగ్లింగ్‌కు ఉపయోగిస్తున్న ఓ వ్యానులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య కంపార్ట్‌మెంట్లు వెలుగులోకి వచ్చాయి. వ్యానులో బయటకు కనిపించకుండా సీక్రెట్ కేబిన్లు ఏర్పాటు చేసి, వాటిలో టేకు దుంగలను దాచి తరలించేందుకు స్మగ్లర్లు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. సాధారణ తనిఖీల్లో అనుమానం రావడంతో వ్యానును క్షుణ్ణంగా పరిశీలించిన అటవీశాఖ సిబ్బంది, వాహనంలో ప్రత్యేక అరలను గుర్తించి అందులో దాచిన టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వ్యానును సీజ్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ అక్రమ రవాణా వెనుక పనిచేస్తున్న ముఠా, టేకు కలపను ఏ అటవీ ప్రాంతం నుంచి సేకరించారు, ఎక్కడికి తరలించాలనే ప్రణాళికతో ఉన్నారు, ఇందులో మరెవరెవరి ప్రమేయం ఉందనే కోణాల్లో అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ అడవుల పరిరక్షణలో రాజీ పడబోమని, అక్రమ కలప రవాణాపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను మరింత ముమ్మరం చేసి స్మగ్లర్ల ఆటకట్టిస్తామని స్పష్టం చేశారు.



# చౌటుప్పల్‌లో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి: డా. చిలకల శ్రీనివాస్ యాదవ్
- ఆరోగ్య, మున్సిపల్ శాఖల సమన్వయంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వినతి




**తొలివెలుగు, చౌటుప్పల్ :** వర్షాల కారణంగా చౌటుప్పల్ పట్టణంలో నీరు నిల్వ ఉండి, మురుగు కాల్వలు పొంగిపొర్లుతుండటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిందని బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పీఏసీ సభ్యుడు డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, దోమల నివారణకు ఫాగింగ్, లార్వా నాశక మందులను విస్తృతంగా పిచికారీ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటూ, పరిశుభ్రత పాటించి అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# చెరువు శిఖం కబ్జా.. నీర్నేములలో భూ అక్రమాల కలకలం!

- ప్రజావాణిలో కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు
- తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు విచారణ ఆదేశాలు
- ఉమ్మడి సర్వే నిర్వహించి కబ్జాలు తొలగించాలని విజ్ఞప్తి

**తొలివెలుగు, రామన్నపేట:** మండలం నీర్నేముల గ్రామంలో ప్రభుత్వ భూములు, చెరువు గర్భం, కుంటల శిఖం భూములపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాధ్యతాయుత పౌరులు, గ్రామస్తులు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ తీర్మానం మేరకు తహసీల్దార్ గతంలోనే (ఈ.ఎన్.డీ.టీ నెం: డీ/470/2026) ద్వారా ఉమ్మడి సర్వే నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని కొందరు చెరువు శిఖం భూములను ఆక్రమించి సాగు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ స్థానిక అధికారులు స్పందించలేదని పేర్కొన్నారు. ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌తో పాటు నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, చెరువు శిఖం భూములు ప్రజల ఉమ్మడి ఆస్తి కావడంతో భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి సర్వే నిర్వహించి అక్రమ ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# నగరంలో మోస్తరు వాన

ఉపరితల ద్రోణి ప్రభావంతో సోమవారం సా యంత్రం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 9గంటల వరకు నగరంలోని మామిడిపల్లిలో అత్యధికంగా 2.70 సెం.మీ లు, కొంగరకలాన్‌లో 2.55 సెం.మీలు,మహేశ్వరంలో 2.30 సెం.మీలు, ఇబ్రహీంపట్నం మంగల్‌పల్లెలో 1.55 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో రాగల 48 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.





# చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ
- దేశవ్యాప్తంగా 'ఇక్కత్' ప్రచారం: ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు, నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో నూతనంగా ఎన్నికైన పోచంపల్లి చేనేత సహకార సంఘం కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గానికి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే.. ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ, నేతన్నల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు లేకుండా థ్రిఫ్ట్ ఫండ్ నిధులను విడుదల చేసిందన్నారు. ఇటీవల హైటెక్స్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్ ద్వారా దాదాపు రూ. 15 కోట్ల విలువైన వస్త్రాల కొనుగోళ్లు జరిగి వ్యాపారులకు ఎంతో మేలు చేకూరిందన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఇక్కత్ బ్రాండింగ్‌ను మరింత విస్తరించే బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భారత లవ కుమార్ తో పాటు కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్, రాష్ట్ర చేనేత నాయకుడు కర్నాటి ధనంజయ, ప్రథమ ఎంపీపీ బడుగు దానయ్య, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, సహకార సంఘం ప్రధాన కార్యదర్శి సూరపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సీత శ్రీశైలం, కోశాధికారి కోడి బిక్షపతి, డైరెక్టర్లు కడవేరు చంద్రమౌళి, గంజి బసవలింగం, పాలాది జ్యోతి, మహేశ్వరం నాగమణి, మేనేజర్ రుద్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.






## వైభవంగా ఆందోల్ మైసమ్మ బోనాలు

- ఆగస్టు 1 నుంచి 3 వరకు జాతర మహోత్సవాలు
- ఆహ్వాన పత్రికలు విడుదల చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానంలో ప్రతిఏటా నిర్వహించే బోనాల ఉత్సవాలను ఆగస్టు 1 నుంచి 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బోనాల జాతర ఆహ్వాన పత్రికతో పాటు గోడపత్రికలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జాతర మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు పబ్బు రాజు గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి, దండు మల్కాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుక్క రవీందర్, ఉపసర్పంచ్ మీసాల నర్సింహ, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యామ్ సుందర్ ముదిరాజ్, ఆందోల్ మైసమ్మ దేవస్థాన మాజీ చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఈడుదుల మస్తాన్ బాబు యాదవ్, చౌటుప్పల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు, ప్రధాన అర్చకులు వల్లూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం

- భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



**తొలివెలుగు, చౌటుప్పల్ :** హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన ఓ ప్రైవేటు ఉద్యోగి అదృశ్యమైన సంఘటన చౌటుప్పల్‌లో చోటుచేసుకుంది. చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) గ్రామానికి చెందిన గుణగాటి మల్సూర్ (45) చౌటుప్పల్‌లోని హనుమాన్ నగర్ కాలనీలో నివాసముంటూ హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఎంఎస్ఎన్ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీ ఉదయం 10:20 గంటల సమయంలో 'హైదరాబాద్ వెళుతున్నాను' అని చెప్పి ఇంట్లోంచి బయలుదేరాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మల్సూర్ భార్య రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.



## ఉన్నత లక్ష్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు


- పదవ తరగతి ప్రతిభావంతులకు పతకాల ప్రదానం
- కల్పన ఫౌండేషన్, త్రివేణి సాహితి సంఘాల కృషి ప్రశంసనీయం: ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు శ్రమిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. భూదాన్ పోచంపల్లి పురపాలక వర్గం సమావేశ మందిరంలో కల్పన ఫౌండేషన్, త్రివేణి సాహితి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పట్టణ, మండల పరిధిలోని 32 మంది విద్యార్థులకు వెండి, కాంస్య పతకాల బహూకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పతకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చదువే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. విద్యార్థి దశ నుంచే పట్టుదలతో చదివితే ఆశించిన లక్ష్యాలు సిద్ధతిస్తాయన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తున్న కల్పన ఫౌండేషన్, త్రివేణి సాహితి సంఘం ప్రతినిధుల సేవా దృక్పథం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జా సత్యం, పద్మశ్రీ గజం అంజయ్య, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు తడక యాదగిరి, పట్నం కృష్ణకుమార్, తడక లావణ్య, కౌన్సిలర్లు రావుల జంగయ్య, కొండమడుగు ఎల్లస్వామి, దేవరాయ కుమార్, సూరపల్లి రాధికా రమేష్, కో-ఆప్షన్ సభ్యులు మద్ది మధు, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి

- ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్
- బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 22ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించి రైతులకు న్యాయం చేయాలని చౌటుప్పల్ మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల అలసత్వం, సాంకేతిక లోపాల కారణంగా చట్టబద్ధమైన అనేక పట్టా భూములు పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదయ్యాయని తెలిపారు. దీనివల్ల భూముల అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోయి రైతులు, సాధారణ ప్రజలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. సొంత భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యపై ఆర్డీఓ ప్రత్యేకంగా దృష్టి సారించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పొరపాటున నమోదు చేసిన పట్టా భూములను సమీక్షించి జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.








## విరిగిపోయేలా విద్యుత్ స్తంభం.. నిద్రమత్తులో అధికారులు!

- చిన్నగూడూరులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆందోళన
- బయటకు వచ్చిన ఇనుప చువ్వలు.. ఎప్పుడేం జరుగుతుందోనని భయం
- తక్షణమే కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని డిమాండ్

**తొలివెలుగు, చిన్నగూడూరు :** మండల కేంద్రంలోని చిన్నగూడూరులో ప్రమాదకర స్థితికి చేరుకున్న విద్యుత్ స్తంభం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఇరుకుల సంపత్ ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభం తీవ్రంగా దెబ్బతిని కాంక్రీట్ ఊడిపోవడంతో లోపలి ఇనుప చువ్వలు, తీగలు బయటకు కనిపిస్తున్నాయి. స్తంభం ఏ క్షణంలోనైనా విరిగిపడే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు భయపడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. ప్రమాదం జరగకముందే స్పందించి దెబ్బతిన్న స్తంభాన్ని తొలగించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ జన్మదిన వేడుకలు

- మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ
- బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ



**తొలివెలుగు, చౌటుప్పల్ :** మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని చౌటుప్పల పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు శ్రీ శ్రీ శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కర్నే ప్రభాకర్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దగోని ప్రసాద్ గౌడ్, తూర్పుంటి గణేష్, పల్చం శ్రీకాంత్ గౌడ్, చేవెళ్ళి సాయి, ఊదరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- లాక్కారం క్యాంప్ ఆఫీస్‌లో లబ్ధిదారులకు చెక్కుల అందజేత
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి లబ్ధిదారుల కృతజ్ఞతలు


**తొలివెలుగు,చౌటుప్పల్ :** చౌటుప్పల లాక్కారం క్యాంపు కార్యాలయంలో తూప్రాన్‌పేట్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారసుతో మంజూరైన ఈ చెక్కులను చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి తదితరులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బక్కతట్ల జంగయ్యకు రూ. 85,000, మంటిపల్లి చెన్నయ్యకు రూ. 40,000, ఏనుగుల లక్ష్మమ్మకు రూ. 15,000 విలువైన చెక్కులను అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఈ సాయం కొండంత అండగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెలిగే రాజశేఖర్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, డీసీసీ కార్యదర్శి అర్థ వెంకట్ రెడ్డి, తూప్రాన్‌పేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెంచల శ్రీనివాస్, నల్ల నరేందర్ రెడ్డి, గంధం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. ట్రాఫిక్ ఆంక్షలు

బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం, రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్ మళింపు అమలులో ఉంటుందని నగర పోలీసు ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున బల్కంపేట పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్ అయ్యే సూచనలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద ట్రాఫిక్ మళ్లింపు చేపట్టామని తెలిపారు. గ్రీన్‌ల్యాండ్స్, మాతా టెంపుల్, సత్యం థియేటర్ వైపు నుంచి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, ఫతేనగర్ ఫ్లైఓవర్, ఫతేనగర్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఎస్ఆర్‌నగర్ టీ జంక్షన్ వద్ద ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ నుంచి సనత్‌నగర్ రోడ్డు వైపు మళ్లిస్తారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుంచి బల్కంపేట ఆలయం వైపు వచ్చే ట్రాఫిక్‌ను అనుమతించకుండా ఈ వాహనాలను హైదరాబాద్ కిచెన్ మార్ట్ న్యూ బ్రిడ్జి వద్ద ఆర్‌యూబీ ద్వారా కట్టమైసమ్మ దేవాలయం బేగంపేట వైపు మళ్లిస్తారు. గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బల్కంపేట వైపు వచ్చే ట్రాఫిక్‌ను అనుమతించకుండా ఫుడ్‌వరల్డ్ ఎక్స్ రోడ్స్ వద్ద సోనాబాయి టెంపుల్ గుండా ఎస్ఆర్‌నగర్ టీ జంక్షన్ వైపు మళ్లిస్తారు. బేగంపేట, కట్టమైసమ్మ ఆలయం వైపు నుంచి బల్కంపేట ఆలయానికి వచ్చే ట్రాఫిక్‌ను బేగంపేట ఫ్లైఓవర గుండా గ్రీన్‌ల్యాండ్స్ వైపు మళ్లిస్తామని పోలీసులు తెలిపారు. ఎస్ఆర్ నగర్ టీ జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న ఉపసందులు, లింక్ రోడ్లు అన్నీ మూసివేస్తున్నట్లు ప్రకటించారు. భక్తులు తమ వాహనాలను ఆర్అండ్‌బీ ఆఫీస్, జీహెచ్ఎంసీ గ్రౌండ్స్, పద్మశ్రీ అపార్ట్‌మెంట్స్, డీకేరోడ్ నుంచి నేచర్ క్యూర్ హాస్పిటల్ రోడ్డువైపు పార్కింగ్, ఫతేనగర్ అండర్‌బ్రిడ్జి, నేచర్ క్యూర్ హాస్పిటల్, సనత్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్ వద్ద పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. మరోవైపు బల్కంపేట ఎల్లమ్మ బోనాలకు మంగళ, బుధవారాల్లో వచ్చే భ క్తుల కోసం జంటనగరాల్లోని పలు ప్రాంతాల నుంచి 80 ప్రత్యేక బస్సులు నడుపుతున్న ట్లు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.పోలీసు శాఖ సూ చనలతో బస్సులు నడుపుతామని చెప్పారు.

# ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్.. ఆన్‌లైన్ గేమ్స్ మాయలో యువత




సికింద్రాబాద్ పరిధిలోని తిరుమలగిరిలో ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైన 22 ఏళ్ల మణికంఠ అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. అక్రమ పద్ధతిలో నడుస్తున్న ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లలో నిర్వాహకులు ఏఐ సహకారాన్ని తీసుకుంటూ కోట్ల రూపాయల మోసాలకు పాల్పడుతున్నారు. ఈ గేమ్స్‌ను వివిధ సోషల్‌మీడియా గ్రూప్స్‌లో ప్రమోట్ చేస్తూ అమాయకులను ఆకర్షిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోయినవారు ఆ షాక్ నుంచి కోలుకోక, బయట మొఖం చూపించలేక బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. ఆన్‌లైన్ గేమ్స్‌ను అరికడుతూ, నిర్వాహకులను పట్టుకోవాల్సిన పోలీసు వ్యవస్థ ఆ విషయాన్ని పట్టించుకోక పోవడంతో ఆన్‌లైన్ బెట్టింగ్ రాష్ట్రంలో యథేచ్ఛగా కొనసాగుతున్నది. 2017లో తెలంగాణ రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటలను నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలను అరికట్టడంలో తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**బలవన్మరణాలకు పాల్పడుతున్న బాధితులు..**

నగర శివారుతో పాటు నగరంలో ఇప్పటివరకు పలువురు యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో వివిధ గేమ్స్ ఆడి భారీ ఎత్తున మోసపోయారు. అందులో పలువురు ఆత్మహత్యలు సైతం చేసుకున్నారు. పిల్లలను కష్టపడి చదివించి బంగారు భవిష్యత్తు ఇవ్వాలని తల్లిదండ్రుల ఆశలు ఆడియాశలు అవ్వడమే కాకుండా, చేతికి అందివచ్చిన తమ పిల్లలను కోల్పోతూ ఆయా కుటుంబాలు శోకసంద్రంలోకి వెళ్తున్నాయి. తాజాగా తిరుములగిరి ఘటనలో 22 ఏండ్ల యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గతంలో ఎల్బీనగర్‌లో ఒక ఇంజినీరింగ్ విద్యార్థి ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి భారీ నష్టాలు చవిచూశాడు. ఆ నష్టాలతో బయట తిరగలేక హాస్టల్ గదిలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలోనూ ఇలాంటి పలు ఘటనలు గతంలో జరిగాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కారణంగా నిత్యం ఇళ్లలో గొడవలు జరగడం, అప్పుల పాలైన తరువాత తమ తల్లిదండ్రులను మోసం చేశామని, ఎవరు చెప్పినా వినకుండా గ్యాంబ్లింగ్ ఆటకు బానిసైపోయామనే వేదనతో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ అక్రమ యాప్‌లను పూర్తిస్థాయిలో నిలువరించడంలో రేవంత్ సర్కార్, పోలీస్ వ్యవస్థ వైఫల్యం చెందుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా ఎంతమంది యువకులు బలిపీఠం ఎక్కాలంటూ సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇన్ఫ్లుయెన్సరు ఈ గ్యాంబ్లింగ్ గేమ్స్‌ను ప్రమోట్ చేసి భారీగా డబ్బు సంపాదించిన ఘటనలు ఉన్నాయి. అలాంటి ఇన్ఫ్లుయెన్సర్స్‌పై పోలీసులు కేసులు సైతం నమోదు చేశారు. కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న ఈ ఆన్‌లైన్ గేమ్స్ వ్యవహారం తిరిగి ప్రారంభం కావడంతో యువత పక్కదారి పడుతున్నారని.. ఇలాంటి వాటిపై పోలీసులు ఉక్కుపాదంతో అణిచివేయాలని ప్రజలు కోరుతున్నారు.

**మొదట లాభాలు.. ఆ తర్వాత గ్యాబ్లింగ్**

ఆన్‌లైన్ రమ్మీ, ఇతర గ్యాంబ్లింగ్ ఆటలోకి కస్టమర్లను ఆకర్షించేందుకు వివిధ వెబ్‌సైట్లు ఇంటర్‌నెట్‌లో భారీ ప్రకటనలిస్తుంటాయి. వీటికితోడు మా వెబ్‌సైట్లో సభ్యత్వం తీసుకుంటే బంపర్ ఆఫరిస్తామంటూ బుట్టలో పడేస్తున్నాయి. ఆట ప్రారంభంలో డబ్బులు ఇచ్చినట్లే చేసి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటపై వినియోగదారులకు మోజు పెంచుతున్నాయి. ఇది వ్యసనంగా మారడంతో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటల నుంచి బయటకు రాని పరిస్థితిలో చాలామంది ఉంటున్నారు. ఏ సభ్యుడు రోజు ఎంత సేపు ఆడుతున్నాడనే విషయాన్ని గుర్తిస్తూ, ఆన్‌లైన్ సైట్ నిర్వాహకులు వారి దృష్టంతా ఆటపై ఉండేందుకు జిమ్మిక్కులు చేస్తుంటారు. మొదట రమ్మీ, ఇతర బెట్టింగ్ ఆటలు ఆడినవారికి గెలిచేందుకు కొంత అవకాశమిస్తారు. ఆ తరువాత వారికి ఆటను అలవాటు చేసి ఇక ఆశలో వారిని ముంచేస్తుంటారు. పదిసార్లు పెట్టుబడి పెడితే అందులో 8 సార్లు నష్టపోవడం, రెండు సార్లు లాభం వచ్చినట్లు చూపించే లాజిక్స్‌ను బ్యాకెండ్ నుంచి గ్యాంబ్లింగ్ ఆట నిర్వాహకులు చేస్తుంటారు. ఇలాంటి గ్యాంబ్లింగ్ ఆటపై గతంలో హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. కలర్ ప్రిడిక్షన్ గేమ్‌ను గతంలో ఉక్కుపాదంతో అణిచివేశారు. ఈ గేమ్‌లో నష్టపోయిన వారు ఆత్మహత్మలు చేసుకుంటుండటంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వేగంగా పోలీసులు స్పందించి మూలాల వరకు వెళ్లి ఆన్‌లైన్‌లో జరిగిన స్కామ్‌ను వెలుగులోకి తెచ్చి దేశవ్యాప్తంగా నిర్వాహకులను పట్టుకున్న విషయం తెలిసిందే.

# కరువును ఎదుర్కొనేందుకు సర్కార్ సిద్ధం




నీలగిరి, జూలై 20: వాతావరణంపై ఎల్ నినో ప్రభావం ఉన్నందున ఎటువంటి పరిస్థితులనైనా ఎదురొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొం డ జిల్లా పరిధిలో కరవు పరిస్థితులు, తాగునీటి లభ్యత, సాగునీరు, వ్యవసాయం, భూగర్భ జలాలు, విద్యు త్తు సరఫరా, మిషన్ భగీరథ మౌలి క వసతు కల్పనపై సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, విద్యుత్తు, మున్సిపల్, మిషన్ భగీరథ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.దఈ సందర్భంగా ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావంతో మన దేశంలో రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉందన్నారు. జూలై 20 వరకు నమోదైన వర్షపాతం ఆందోళన కలిగిస్తోందన్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో కూడా తగినంత వర్షపాతం నమోదు కాకపోతే, వచ్చే ఏడాది జూలై వరకు ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందన్నారు. అందువల్ల తాగునీటి వనరులను కాపాడటం అత్యంత కీలకమన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కర్నాటక ప్రభుత్వాన్ని సంప్రదించి తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను విడుదల చేయమని అభ్యర్థించే అవకాశం ఉందన్నారు. వచ్చే ఏడాది జూన్ వరకు రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నీటిని అత్యం త పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీరు, భూగర్భ జలాల లభ్యతపై స్పష్టత లేని ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. 578 గ్రామాలు, నాలుగు పట్టణాలకు తాగునీరు అందించే ఉద య సముద్రం రిజర్వాయర్‌లో సుమారు 1.5 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీరు డిసెంబర్ వరకు సరిపోతుందని, ఆ తర్వా త వచ్చే ఏడాది జూలై వరకు అదనపు నీటి అవసరం ఉంటుందని వివరించారు. పాలేరు జలాశయంలో ప్రస్తుతం 1.99 టీఎంసీల నీరు ఉండగా, అది దాదాపు 90 రోజుల వరకు సరిపోతుందని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజె క్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉం దని అధికారులు వివరించారు. ఇన్‌చార్జి మం త్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నా రు. తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే ట్యాంకర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పం టలు వేసేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. 2028 ఆగస్టు నాటికి శ్రీశై లం సొరంగ మార్గాన్ని పూర్తి చేసి జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ అఫీసర్ దాసరి హరిచందన, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, నేనావత్ బాలూనాయక్, పద్మావతి రెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, మేయర్ బుర్రి చైతన్య, మూడు జిల్లా ల కలెక్టర్లు చంద్రశేఖర్, తేజస్ నందలాల్ పవా ర్, అనురాగ్ జయంత్, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, శ్రీనివాస్, ప్రేమ్‌కరణ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



# రక్తదానంతోనే ప్రాణదానం..!


- ఆయాన్స్ భార్గవ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహారక్తదాన శిబిరం
- రక్తదాతలను అభినందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్ :** ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసే రక్తదానం అత్యంత పవిత్రమైనదని మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొనియాడారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని గట్టు శ్రీరాములు గార్డెన్‌లో 'ఆయాన్స్ భార్గవ్ సేవా ట్రస్ట్' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహారక్తదాన శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజ సేవే ధ్యేయంగా ట్రస్ట్ నిర్వాహకులు ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించి, అభినందన పత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, యువత ఇటువంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిగే రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోసిక వినయ్ కుమార్, పలువురు కౌన్సిలర్లు, ట్రస్ట్ నిర్వాహకులు, వైద్యాధికారులు, రక్తదాతలు పాల్గొన్నారు.

# నేడు లక్కారంలో 'యాంటీ డ్రగ్స్' అవగాహన సదస్సు

- చౌటుప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరుకానున్న యువత, ప్రజాప్రతినిధులు




**తొలివెలుగు, చౌటుప్పల్ :** మాదకద్రవ్యాల నివారణే లక్ష్యంగా చౌటుప్పల్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 'నార్కోటిక్స్ – యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం' నిర్వహించనున్నట్లు సీఐ జి. మన్మధ కుమార్ తెలిపారు. లక్కారం గ్రామంలోని వివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ?మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి నివారణ మార్గాలు, యువత వహించాల్సిన పాత్ర, సమాజంలో అవగాహన పెంపొందించే అంశాలపై అధికారులు స్పష్టమైన అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు చౌటుప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆరోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య

- చిన్న కొండూరులో విషాదం
- కేసు నమోదు చేసిన చౌటుప్పల్ పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చౌటుప్పల్ మండల పరిధిలో చోటుచేసుకుంది. చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న కొండూరు గ్రామానికి చెందిన నానంచర్ల పెంటయ్య (72) ఇంట్లోనే ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం దాదాపు 12:00 గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకొని మృతిచెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

